పేద విద్యార్థులకు చేయూత

- సర్కార్ స్కూళ్లంటే ఆయనకు ప్రాణం
- పదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ
- పాఠశాలలకు ఇతర వసతుల కల్పన
- ఇప్పటి వరకు సుమారు రూ.60లక్షల వరకు ఖర్చు
- ఆదర్శంగా నిలుస్తున్న దయాలాల్ పటేల్



నోట్ బుక్స్ అందజేస్తున్న దయాలాల్ పటేల్



దయాలాల్ పటేల్‌ను సన్మానిస్తున్న డీఈఓ సత్యనారాయణ

బొమ్మలరామారం : ఆయనకు ప్రభుత్వ పాఠశాలలపై మక్కువ. పేద విద్యార్థులపై ప్రేమ ఎక్కువ. సమాజంలో పేదల జీవితంలో వెలుగులు నింపేది విద్య ఒక్కటేనని తాను భావించాడు. దీంతో ఆయన మనస్సు మారుమూల పాఠశాలల వైపు పయనించేలా చేసింది. మానవ సేవే మాధవ సేవ అనే సంకల్పంతో పదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లక్షల వ్యయంతో నోట్‌పుస్తకాలు అందజేస్తున్న దాత దయాలాల్ పటేల్‌పై కథనం.

గుజరాత్ రాష్ట్రం నుంచి 35 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన పలు వ్యాపారాల్లో స్థిరపడిన దయాలాల్ పటేల్‌కు చిన్ననాటి నుంచి సామాజిక సేవకులు. తన సేవలను విస్తరించాలనే ఉద్దేశంతో దయాలాల్ పటేల్ 2009లో మారుమూల ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను వెతుక్కుంటూ బొమ్మలరామారం మండలం వచ్చారు. దయాలాల్ పటేల్ తను సేవా కార్యక్రమాలు చేయడానికి వచ్చానని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇటికాల మల్లేష్‌ను సంప్రదించాడు. దీంతో ఉపాధ్యాయుడు ఇటికాల మల్లేష్ భవిష్యత్తు తరాలకు మంచి జరిగేలా దయాలాల్ పటేల్‌తో సమాలోచన చేశారు. మండలంలోని సర్కార్ పాఠశాలల్లో చదివేది పేద విద్యార్థులేనని వారికి ప్రతి సంవత్సరం నోట్‌బుక్‌లు అందజేయాలని కోరారు. దీంతో ఆయన మరోమారు ఆలోచించకుండా 2010నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

54పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్‌ల పంపిణీ..

మండలంలో 8జెడ్పీ హైస్కూల్‌లు, ఒక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, ఒక మోడల్‌స్కూల్, రెండు ప్రాథమికోన్నత పాఠశాల, 42 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారుగా 2800మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారికి ప్రతి సంవత్సరం దయాలాల్ పటేల్ దాదాపుగా రూ.4లక్షల ఖర్చు చేస్తూ నోట్‌బుక్స్ అందజేస్తూ వస్తున్నారు.

విస్తరిస్తున్న సేవా కార్యక్రమాలు..

దయాలాల్ పటేల్ తన సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తున్నారు. మండలంలోని నాగినేనిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల కోరిక మేరకు 2016లో పాఠశాలలో రూ.3లక్షల వ్యయంతో బోరు వేయించి మోటారు పంప్‌సెట్‌ను ఏర్పాటు చేయించారు. అదే విధంగా హైదరాబాద్ పరిసర ప్రాంతంలో గల 60మంది వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా 10కిలోల బియ్యాన్ని అందజేస్తున్నారు. పలు పాఠశాలలకు సైతం నోట్‌బుక్స్ అందజేస్తున్నారు.

> **చదువు ఖర్చుకు వెనుకాడను**
>
> పేద విద్యార్థుల చదువు కోసం ఎంత ఖర్చైనా వెనుకాడను. మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ ప్రతి సంవత్సరం కొనసాగిస్తున్నాను. ఆర్థిక సమస్యతో పేద విద్యార్థులు చదువును మధ్యలోనే మానేయవద్దు. అలాంటి వారికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయి.
>
> – దయాలాల్ పటేల్

కాంగ్రెస్ ప్రజాపాలనలో పెరిగిన పేదల ఆత్మగౌరవం

- ఎమ్మెల్యే వేముల వీరేశం



రామన్నపేట వ్యవసాయ మార్కెట్‌లో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట : కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేయడంతో పేదల ఆత్మగౌరవం పెరిగిందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం మండలంలోని ఇంద్రపాలనగరం, నిధానపల్లి, లక్ష్మాపురం, శోభనాద్రిపురం, కొత్తగూడెం, సిర్నేపల్లి గ్రామాల్లో ఆయన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులను సన్మానించి స్వీట్లు తినిపించారు. త్వరితగతిని ఇండ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇసుకతో పాటు మెటీరియల్ సేకరణకు ఇబ్బంది కలుగకుండా అధికారులు లబ్ధిదారులకు సహకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండో విడతలో మిగిలిన అర్హులకు ఇండ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మండలానికి 950కుటుంబాలకు మొదటి విడతలో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు.

మార్కెట్‌లో రూ.1.07కోట్లతో అభివృద్ధి పనులు

రామన్నపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రూ.1.07కోట్ల వ్యయంతో నిర్మించే దుకాణ సముదాయం, సీసీరోడ్లు, ఆర్వోప్లాంట్ ఏర్పాటు పనులను ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ భూక్యా భీమానాయక్, వైస్‌చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, ఎంపీడీఓ రాములు, మార్కెట్ సెక్రటరీ వెంకటలక్ష్మి, నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి, పూస బాలనర్సింహ, గంపల రామచంద్రారెడ్డి, కూనూరు సాయికుమార్, ఎండీ రెహాన్, గోదాసు పృథ్వీరాజ్, ఎండీ అక్రం, గుత్తా నర్సిరెడ్డి, కొండకింది శేఖర్‌రెడ్డి, బొడిగె శ్రీనివాస్, ఏటెల్లి పరమేష్, బత్తుల క్రిష్ణగౌడ్, చిల్లర కైలాసం, తదితరులు పాల్గొన్నారు.

దాశరథి సాహిత్యం నేటి సమాజానికి అవసరం



దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి : తెలంగాణ ప్రముఖ కవి దాశరథి అభ్యుదయ భావాలు, సాహిత్యం నేటి సమాజానికి ఎంతో అవసరమని కవి, సీనియర్ జర్నలిస్ట్ పున్న సుదర్శన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని త్రివేణి సాహితీ సంఘం ఆధ్వర్యంలో దాశరథి శత జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దాశరథి తమ రచనల ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్యం చేశారని అన్నారు. నేటి యువతలో సాహిత్యంపై అభిలాష కల్పించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కవులు వడ్డేపల్లి రాజేశ్వర్, గడ్డం పాండురంగం దాశరథిపై కవితలు, గేయాలను వినిపించారు. కార్యక్రమంలో త్రివేణి సాహితీ సంఘం వ్యవస్థాపకుడు, నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ తడక యాదగిరి, అధ్యక్షుడు గుంటి దయానంద్, కవులు డాక్టర్ పాండాల మహేశ్వర్, పట్నం కృష్ణకుమార్, గజ్జెల రామకృష్ణ, యాదగిరి, భగవాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించాలి



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

భువనగిరి : జిల్లాకు చెందిన క్రీడాకారులు సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పథకాలు సాధించాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు అన్నారు. హన్మకొండలో వచ్చే నెల 3, 4తేదీల్లో నిర్వహించే సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హన్మకొండలో జరగనున్న పోటీలకు ఎంపికైన క్రీడాకారులు తన ఒరిజినల్ వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్, ఉపాధ్యక్షులు మాటూరి వినోద్, వెంకటరమణ, సాంకేతిక అధికారులు రఘువీర్‌సింగ్, సునీల్ మల్లేష్, మల్లికార్జున్, నవీన్, కరుణాకర్, అనిత, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

తుర్కపల్లి : మండలంలోని పల్లెపహాడ్ గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు ఊరేగింపు వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామ పెద్దలు, యువజన సంఘాల సభ్యులు పండుగ ఏర్పాట్లను విజయవంతంగా నిర్వహించారు.

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గ్రామ దేవతలకు బోనాలను తీసుకెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మచ్చ వసంతా శ్రీనివాస్ గౌడ్, బల్‌రామ్ గౌడ్, మల్లాగౌడ్, శ్రీదేవి చంద్రమౌళిగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గొడుగు చంద్రమౌళి, రాగుల బల్‌రామ్, రంగా రామాగౌడ్ పాల్గొన్నారు.



తుర్కపల్లి : బోనాలతో వస్తున్న మహిళలు



బొమ్మలరామారం : బోనం తీసుకెళ్తున్న మాజీ సర్పంచ్ వసంతా శ్రీనివాస్‌గౌడ్

విద్యుత్ సరఫరా నిలిపివేత

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సంస్థాన్‌నారాయణపురం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దివ్య ఆదివారం తెలిపారు. అందుకు వినియోగదారులు సహకరించాలన్నారు.

22న ఉద్యమకారుల ధర్నా

రామన్నపేట : తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఫోరం మైనార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే చాంద్ ఆదివారం తెలిపారు. ఈ ధర్నాలో ఉద్యమకారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో తెలంగాణ సాధన కోసం త్యాగాలు, పోరాటాలు చేసిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

భువనగిరి : పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో అర్హులకు మంజూరైన కొత్త రేషన్‌కార్డులను సోమవారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ అంజిరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నట్లు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆలయ కమిటీ సభ్యుల నియామకం

భువనగిరి : మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో గల శ్రీత్రిలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులను నియమిస్తూ ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఆదివారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదగా సభ్యులు అందుకున్నారు. సభ్యులుగా వరుగంటి నాగయ్య, లెంకలపల్లి పద్మ, కోట సత్యనారాయణ, వరిగంటి బాలయ్య, బోమ్మారపు కొండల్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ఆలేరు : ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు మొరిగాడి వెంకటేష్‌గౌడ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

ఆలేరు : ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధనలో భాగంగా ఈ నెల 22న తలపెట్టిన బహిరంగ సభ కరపత్రాలను ఆదివారం పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద రెవెన్యూ డివిజన్ సాధన సమితి నాయకులు విడుదల చేశారు. అనంతరం వాటిని ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు అఖిలపక్ష కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సన్మానం

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల నూతనంగా ఎన్నికైన నేతాజీ యువజన మండలి అధ్యక్షుడు దొంతరబోయిన, మురళీకృష్ణ, యాస మహేందర్ రెడ్డి, శివాజీ యువజన మండలి అధ్యక్షుడు మజ్జిగ నరేష్, తొండల అనిల్‌కుమార్‌ను పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేకపోతుల స్వామి, సభ్యులు ఆరె వెంకన్న, తవిటి మచ్చగిరి, మజ్జిగ లెనిన్ పాల్గొన్నారు.

కుమ్మరి సంఘం ఎన్నిక

ఆలేరురూరల్ : మండలంలోని సాయిగూడెంలో కుమ్మరి సంఘం మండల కన్వీనర్ గంగదారి సుధీర్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామశాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా గంగదారి పరమేష్, ఉపాధ్యక్షుడిగా గంగదారి సాయికిరణ్, కమిటీ సభ్యులు గంగదారి శ్రావణ్‌కుమార్, మల్లేషం, శివప్రసాద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కోకన్వీనర్ కె.ఉపేందర్, గ్రామ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ సేవా సమాఖ్య కమిటీ ఎన్నిక



ప్రభుత్వ విప్ అయిలయ్యను సన్మానిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : పట్టణంలో శ్రీవైష్ణవ సేవా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కారంపూడి నరసింహాచార్యులు, ఉపాధ్యక్షుడిగా ముడంబై గిరిధర్‌చార్యులు, ప్రధాన కార్యదర్శిగా ఉండ్రుగొండ కిరణ్‌కుమార్ ఆచార్యులు, సహాయ కార్యదర్శిగా సంతోష్‌ఆచార్యులు, కోశాధికారిగా మంగళగిరి చలమాచార్యులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొని మాట్లాడారు. వైష్ణవ సేవా సమాఖ్య భక్తుల్లో, స్థానికుల్లో ఆధ్యాత్మిక, భక్తిభావాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. నూతన కార్యవర్గం సమాఖ్య బలోపేతానికి కృషి చేయాలని, వైష్ణవ సేవా సమాఖ్య సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ముందుటానని వెల్లడించారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను వైష్ణవ సేవా సమాఖ్య సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదగిరి ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, రిటైర్డ్ ప్రధానార్చకులు కారంపూడి నరసింహచార్యులు, రంగాచార్యులు, రిటైర్డ్ ఎంఈఓ ముడుంబై జయమోహనచార్యులు, గిరిధర్ తదితరులున్నారు.

టైర్ల రీసైక్లింగ్ కంపెనీల పరిశీలన



మోటకొండూర్ : అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

మోటకొండూర్ : మండలంలోని కాటేపల్లి గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న టైర్ల రీసైక్లింగ్ కంపెనీలను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాటేపల్లి గ్రామపంచాయతీ వద్ద కంపెనీలకు ఇచ్చిన అనుమతులను పరిశీలించారు. కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యం ద్వారా ప్రమాదం అని తెలిస్తే తప్పకుండా మూతపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌తో మాట్లాడి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో మాట్లాడి పూర్తి స్థాయి విచారణ చేయించాలన్నారు. ఆయన వెంట ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగాపురం మల్లేష్, భూమండ్ల శ్రీనివాస్, బాల్ద రామకృష్ణ, కొరటికంటి శ్రీధర్‌గౌడ్, పైళ్ల సుధాకర్, మత్స్యగిరి తదితరులు ఉన్నారు.

సమస్యలపై వినతి

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మార్నింగ్ వాక్‌లో బీజేపీ నాయకులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. హిందు దేవాలయాల ముందు, చెరువు శిఖంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ఏ విధంగా అనుమతి ఇస్తారని నిలదీశారు. దీంతో ఇందిరమ్మ ఇల్లు ఎక్కడైనా కట్టుకోవచ్చునని ఆయన సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్, జిల్లా నాయకులు బందారు సత్యనారాయణ, నాయకులు పైళ్లప్రశాంత్, మజ్జిగ నరేష్, యాస వెంకట్‌రెడ్డి, లోడి మహేష్, గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల సదస్సును జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

భువనగిరి : పట్టణంలో ఈ నెల 22న జరిగే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. ఆదివారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు రూ.6వేలు, వితంతువులు, బీడీ కార్మికులు, వృద్ధులకు రూ.4వేల చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పి ఇప్పటికి హామీని అమలు చేయలేదన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోల్లూరి ఈదయ్యబాబు, సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం ఖాసీం, అధ్యక్షుడు గోగుల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్డుపై సీసీ నిర్మాణం



బసంతపురంలో దెబ్బతిన్న సీసీరోడ్డుపైన నూతంగా వేసిన సీసీ

రాజాపేట : మండలంలోని బసంతపురంలో ఆదివారం సీసీరోడ్డుపైనే తిరిగి సీసీరోడ్డు నిర్మాణం చేపడుతుండడంతో ఇండ్లు లోతట్టుగా మారాయి. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10లక్షలతో గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుమారు 220 మీటర్ల మేర సీసీరోడ్డు పనులు నిర్మాణం చేపట్టారు. కాగా గత కొన్ని సంవత్సరాల క్రితం వేసిన సీసీరోడ్డు దెబ్బతినడంతో అదే సీసీరోడ్డుపై తిరిగి నూతన సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో సీసీరోడ్డు ఎత్తుగా మారి ఆ ప్రాంతంలోని ఇండ్లు లోతట్టుగా మారి ప్రజలు ఇబ్బంది ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. కాగా ఈ విషయమై పీఆర్ ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా రానున్న రోజుల్లో నిధులు కేటాయించి కాలనీలో మురికికాల్వలు ఏర్పాటు చేసి వర్షం నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న నాయకులు

బొమ్మలరామారం : మండలంలోని హాజీపూర్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాల ఏర్పాటుకు ఆదివారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫక్కీరు రాజేందర్‌రెడ్డి భూమి పూజ చేశారు. ప్రాథమిక పాఠశాల ప్రాంగణలో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద ఆశయ సాధనకు యువత, విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల నర్సింహ, ఓరిగంటి రామస్వామి, గోపాల్‌రెడ్డి, గోండ్రు శీను, రేపాక గిరిధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్న అన్నదానం గొప్పది

మోత్కూరు : అన్ని దానాల కన్న అన్నదానం గొప్పదని కోక బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోక భిక్షం అన్నారు. ఆదివారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ జన్మదినం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన కోక బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు దేవాలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 100మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చుక్క సోమన్న, చుక్క సోని, కోక రేణుక, కోక గణేష్, హద్రాస్ ప్రవీణ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

సంస్థాన్ నారాయణపురం : స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సర్వేల్, పుట్టపాక, పల్లగట్టుతండా ఎంపీటీసీ స్థానాలపై ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు జక్కలి రాజు, భాస్కర్, నర్సింహ, నందగిరి జగత్‌కుమార్, మల్లేష్, లక్ష్మి, వెంకటేశం, శ్రీశైలం, నర్సింహ, హతీరాం, సంపత్‌కుమార్, బాలరాజ్, భద్రయ్య, భాస్కర్, చంద్రమౌళి తదితరులున్నారు.

మూలమలుపు.. ప్రమాదానికి పిలుపు



తుర్కపల్లి : భువనగిరి – గజ్వేల్ ప్రధాన రహదారిపై తుర్కపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి – తిరుమలపూరం ఘాట్ రోడ్డుపై గల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో రోడ్ పూర్తిగా అర్థ వలయాకారంలో ఉండి ఏ మాత్రం ఆదమరిచిన ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించేదుకు జంకుతున్నారు. వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో లోయలో పడే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఘాట్ రోడ్డును తవ్వి ఎత్తును తగ్గించి సమాంతరంగా మార్చాలని .. రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

గుర్రపుడెక్క ఆకు తొలగింపు



జేసీబీతో గుర్రపుడెక్క ఆకును తొలగింపజేస్తున్న గ్రామస్తులు

వలిగొండ : మండలంలోని సంగం గ్రామ సమీపంలోని మూసీ వంతెన వద్ద వరదనీరు సాఫీగా వెళ్లేందుకుగాను అడ్డుగా పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకును అదే గ్రామానికి చెందిన నోముల జంగారెడ్డి సౌజన్యంతో ఆదివారం జేసీబీతో తొలగించారు. కార్యక్రమంలో కీసరి రాంరెడ్డి, కాసుల కృష్ణ, వరికుప్పల మల్లేశం, రాంరెడ్డి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తున్న దాతలు

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద నిరుపేద కుటుంబానికి చెందిన మెకానిక్ వాసం నారాయణ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి ఇద్దరు అవివాహిత కుమార్తెలు ఉన్నారు. ఈ నేపథ్యంలో మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు దాతల సహకారంతో సేకరించిన రూ.22,500 చెక్కును ఆదివారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు అవిశెట్టి అవిలుమల్లు చేతుల మీదుగా మృతుడి కుమార్తెలకు అందజేశారు. కార్యక్రమంలో వాట్సాప్ గ్రూపు సభ్యులు దబ్బెటి సోంబాబుగౌడ్, కారుపోతుల వెంకన్న, బొల్లెపల్లి శ్రావణ్, మొరిగాల వెంకన్న, కోమటి జనార్దన్, మర్రి అనిల్, ఇండ్ల రాంప్రసాద్, బయ్యని రాజు, మర్రి ఆనందం, కడమంచి రమేష్, కోల శ్రీనివాస్, మన్నె కరుణాకర్, మడిపల్లి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత బిల్లులు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

భూదాన్‌పోచంపల్లి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు మొదటి విడత డబ్బులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. ఆదివారం మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో జరిగిన ఆ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇల్లు కట్టుకోలేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణాలకు బ్యాంకు రుణాలతో పాటు మెటీరియల్‌ను అందుబాటు ధరలో ఇప్పించాలన్నారు. మండలంలోని గుంతల రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో పార్టీ డివిజన్ మాజీ కార్యదర్శి గూడురు అంజిరెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి పత్తి భిక్షపతి, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, గూడూరు బుచ్చిరెడ్డి, అందెల జ్యోతి, కంజర్ల అశోక్, పగిళ్ల మల్లారెడ్డి, కాగు నర్సింహ, బాత్క భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సైదాపురం గ్రామానికి చెందిన భూపతి రాములు తన వ్యక్తిగత పనుల నిమిత్తం మల్లాపురం గ్రామానికి వచ్చాడు. తన పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మల్లాపురం బైపాస్ వద్దకు రాగానే తుర్కపల్లి నుంచి యాదగిరిగుట్టకు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో అతడికి స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రాములును 108 సహాయంతో ఆసుపత్రికి తరలించారు.

రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలి

రామన్నపేట : గుంతలమయమైన రామన్నపేట-చిన్నకాపర్తి రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కొమ్మాయిగూడెంలో జరిగిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో మంచినీటి ఎద్దడి శాశ్వత నివారణకు చర్యలు తీసుకోవాలని, ధర్మారెడ్డిపల్లి కాలువ ఆధునీకరణలో పేదల ఇండ్లకు నష్టం కలుగకుండా చూడాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, గ్రామశాఖ కార్యదర్శి శానగొండ వెంకటేశ్వర్లు, అంతటి సత్తయ్య, ఎర్ర రవిందర్, కాటమయ్య, పి.నాగయ్య, శేఖర్, నర్సింహ, మల్లేశం, శ్రీను, స్వామి, నరేష్, రాధ, నవ్య తదితరులు పాల్గొన్నారు.